# లంచం

కనుచీకటి పడేవేళ! ఎడతెరిపి లేని ముసురుతో నీళ్ళుకారుతోంది లోకం. ఊరికి సమీపంగా వచ్చిన కుటుంబయ్య దూరంనించి వీధి దీపాలు చూసి నీరసాన్ని వదిలించుకుని నడక వేగం హెచ్చించాడు. కాలువేసి తీసిన చోటల్లా గుంటడు నీళ్ళూరుతూ నేలంతా బురదమయంగా వుంది.

చినుకులు ధాటిగా పడుతూ వాన ఎక్కువయ్యే సూచనలు కన్పించాయి. రఁయ్‌మంటూ వీచిన ఈదురు గాలికి ఆపాదమస్తకం వణికి పోయాడు కుటుంబయ్య. తడి తుండుగుడ్డ తీసి నీళ్ళు పిండి మొహం తుడుచుకున్నాడు.

గాలి ఎడా పెడా హోరుమంటూ వీచింది. గంట స్తంభం గంటలు గణ గణ మోగాయి.

ఆశతో చుట్టుపట్ల చూశాడు కుటుంబయ్య.

తడి పంచె ఎగబట్టుకుని చెరువు గుట్టుమీద బురద తొక్కుకుంటూ గుడికేసి నడిచాడు. వాననీళ్ళు చేరిన గుంటలో కాళ్ళు కడుక్కుని మండపం మీదికి ఎక్కాడు. మండపం మీద నుంచి చూస్తోంటే గొడ్ల పాకలూ .... ఇంకా దూరంగా లోగిళ్ళూ కన్పిస్తున్నాయి. ఎక్కడికి వెళ్ళడానికీ దారి లేని కుటుంబయ్య మండపంమీదే నించున్నాడు. శరీరం నీరసంతో తూలుతోంది.

బాగా చీకటి పడింది. మబ్బులు దట్టంగా కమ్ము కున్నాయి. నెమ్మదిగా గాలీ వానా ఉధృతం అయ్యాయి. భోరున కుంభవృష్టి మొదలైంది. దక్షిణం వేపునుంచి జల్లు ఈడ్చి ఈడ్చి కొడుతోంది. మండ పంలో మూడొంతులు తడిసిపోయింది.

ముద్ద ముద్దయిన కుటుంబయ్య రెండడుగులు వేసి నంది చాటుకు తప్పుకున్నాడు. కాళ్ళు దగ్గిరకి తీసుకుని ముడిచి పెట్టుకుని కూర్చున్నాడు. అసలే మసిగుడ్డ అయిపోయిన పంచె, బురద చిందులతో నిండిపోయింది. బురదలో నాని నాని ఒరిసిపోయిన పాదాలు చల్లగాలికి భగభగ మండుతున్నాయి.

మంచుకన్నా చల్లగా నిట్టూర్చాడు కుటుంబయ్య.

ఒక్క నెల రోజుల క్రిందట .... ఈ కుటుంబయ్య ఎవరు? — కాంట్రాక్టరు! కాంట్రాక్టర్ కుటుంబయ్య లక్షాధికారి! కాలేజీలో చదువుతోన్న కొడుకూ .... అడు గులకు మడుగులొత్తే భార్యా బంధువులూ స్నేహి తులూ — నౌకర్లూ చాకర్లూ, పది మందిలోనూ ఫలానా అన్న పలుకుబడీ — అన్నీ పుష్కలంగా వుండిన వాడు!

ఇప్పుడు .... ఈ కుటుంబయ్య ఎవరు? ఎక్కడు న్నాడు? ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ, భార్యా బిడ్డల్నీ, బంధువుల్నీ వదిలేసుకుని, వేలంలోకి పోబోయే ఇల్లూ వాకిలీ వదిలేసుకుని, పరిచితుల నించి చాటుగా మాటుగా మొహం దాచుకుని — ఊళ్ళమీద తిరుగుతోన్న భ్రష్టుడు! ఆత్మ హత్య చేసుకునే ధైర్యంలేక చచ్చిబతుకుతోన్న దౌర్భాగ్యుడు!

కుటుంబయ్య కళ్ళల్లోనీళ్ళు, జల్లులు పడి నీళ్ళుకారుతోన్న మొహం మీద కాలవలు కట్టాయి.

★ ★ ★

వయస్సు పెరిగి బుద్ధి తెచ్చుకోవాల్సిన ఈడులో కూడా ఆకతాయిగానే తిరిగాడు కుటుంబం. సంవత్స రాలకు సంవత్సరాలే బరువు బాధ్యతలు తెలీకుండా దొర్లాయి. చేతికి అందివచ్చే పన్నెండేళ్ళ కొడుకుతోటీ కంటిలో పాపలా మసులుకొనే భార్యతోటీ, ఏళ్ళ తరబడీ బావమర్ది పంచనపడి ఉన్నా, తన మట్టుకు తను జల్సాగానే గడిపాడు, అప్పో సప్పో చేస్తూ.

ఒక సారెప్పుడో, కుటుంబం, తన కొడుకు తన ఎదటే మేనమామని ఒక్క అర్ధ రూపాయి అడగటం విన్నాడు. వినీ విననట్టు వూరుకున్నాడు, జేబులో ఐదు రూపాయలు వుంచుకుని.

మేనమామ కాస్త వెటకారం మిళాయించి నవ్వాడు — "విగ్రహంలాగ మీ అయ్య కనపట్టం లేదేంట్రా, నన్నడుగుతావేం డబ్బులు?"

రామం మొహమంతా చిట్లించుకుని "మా అయ్య ఇవ్వలేడని నీకు తెలవదా, నాకు తెలవదా? నీ దగ్గరుంటే ఇస్తానను, లేకపోతే లేదు" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

"ఓర్నీ, నీ రోషం నా మీదంట్రా, బాబుని ఏమీ

అన్లేవుగానీ" అని నవ్వాడు మేనమామ.

తల తీసేసినట్టయింది కుటుంబానికి. జేబులు తడుముకున్నాడు. విడి రూపాయి దొరికింది. కొడుకు వెనకాల పరిగెత్తాడు.

ఆ వూపుతోనే పెళ్ళాన్నీ, కొడుకునీ తీసుకొచ్చే శాడు, వారం తిరక్కుండా. స్వంత కాపరం పెట్టాడు.

కడుపులు నిండని ఆకలి, ఆలోచనల్ని పదు నెక్కించింది. నరసప్ప దగ్గరకి పరిగెత్తాడు. "అయ్యా! మీరే నా కేదో దారి చూపించాలి. మా ఇంటిదాన్నీ పిల్లణ్ణీ తీసు కొచ్చేశాను. కష్టపడి బతుకుతాను. మొగ పుటక పుట్టాను కదా?" అన్నాడు పౌరుషంగా.

నరసప్ప నిజంగా సంతోషించాడు. నమ్మి సలహా అడిగిన కుటుంబానికి చిన్న దారి చూపించాడు, తన దారిలోనే. "ప్రస్తు తానికి నా కంట్రాక్టుల్లో ఒకటిస్తాను. శ్రద్ధగా చేసుకో. పెట్టుబడంతా నేను చూసుకుంటాను" అన్నాడు. వ్యాపారంలో సుళువు బళువులన్నీ చెప్పాడు. మెళుకువలు నేర్పాడు.

పొరుగూళ్ళో, ఏటా వానాకాలంలో పొంగుతూ వచ్చే ఏరు, పొలాల మీదికి ఇసుక మేటలు మోసు కొస్తుంది. దాని ఆటలు కట్టిస్తూ ఒక చోట ఒక సిమ్మెంటు గోడ కట్టే పని తను తీసుకున్నాడు కుటుంబం.

పొలం పనులు లేని ఆ రోజులు కుటుంబానికి బాగా కలిసొచ్చాయి. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న కూలీల్ని చౌక చౌక కూలికి కుదిర్చాడు. పర్రలమీద కుప్ప తెప్పలుగా వున్న ఇసకని పోగుచేయించాడు. చుట్టూ అక్కడక్కడా వున్న కొండ రాళ్ళని బద్దలు కొట్టించి పునాదుల్లోకి తోయించాడు. ముడిసరుకు ఖర్చులు చాలా కలిసొచ్చాయి. సిమ్మెంటూ సున్నాలు మాత్రం బళ్ళమీద తోలించాడు.

ఆ పనుల్లో కూలీలతోపాటు కుటుంబం కూడా ఒళ్ళు వొంచి గొడ్డులాగ చేశాడు. కూలీల్ని కూడా కూర్చోనివ్వకుండా, నించో నివ్వకుండా, గొడ్లలాగే చేయించాడు. అనుకున్న సమయం కన్నా ముందే పని అంతా అవగొట్టాడు.

ఇంజినీరు శల్య పరీక్షలకు ఆగగలిగేంత పటి ష్టంగా తయారైంది గోడ! చేసిన పని మెప్పు పొందింది.

ఆ కంట్రాక్టులో పెట్టుబడి కన్నా ఎక్కువగానే చేతిలో మిగిలింది — "ఆహా! డబ్బు గడించటం ఇంత తేలికా!" అనుకున్నాడు కుటుంబం. అన్నిటికన్నా ముందు చేసిన పని, దేవుడి మొక్కు చెల్లించటం.

"ఒరేయ్ బాబూ! రిక్షాని పిలు, కొబ్బరి కాయల బస్తా గుడికి తీసికెళ్ళాలి" అంటూ ఆజ్ఞ జారీచేశాడు కొడుక్కి.

పన్నెండేళ్ళ కొడుకు రిక్షాని పిలవటం మాని తండ్రిని ఆక్షేపించాడు — "ఎందుకు నాన్నా, ఇవన్నీ తీసుకెళ్ళి వాళ్ళకివ్వటం? దేవుడు ఎక్కడైనా వుంటాడం టారుగా? ఆ కొబ్బరికాయలన్నీ మనింట్లోనే కొట్టి అడుక్కుతినే వాళ్ళకి పంచిపెట్టరాదూ? పాపం వాళ్ళు తింటారు" అన్నాడు.

కుటుంబయ్యకి కొడుకు మాటలు కొత్తకాదు. కుర్రాడు అలాగే వాగుతాడని తండ్రికి తెలుసు. "అయ్యేం మాటర్రా? ఎవరు చెప్పార్రా?" అంటే, "మా మేష్టారు చెప్పారు. ఎవరు చెప్తే ఏంటీ? అలాగ చేస్తే మంచిదా కాదా?" అని ఎదురు అడుగుతాడు కొడుకు.

రిక్షాకోసం కదలకండా నించున్న కొడుకు మీద రుసరుసలాడాడు తండ్రి — "అదేంట్రా, అలా కమ్యూ నిస్టోడిలాగ మాట్లాడుతున్నావు? గుళ్ళూ గోపురాలూ ఎందుకు పెట్టారు? మొక్కులు చెల్లించుకుంటే పుణ్యం కదా?" అన్నాడు.

"ఏం పుణ్యం? కొబ్బరి చిప్పలన్నీ పూజారులే తీసుకుపోయి కొబ్బరి హల్వాలూ లస్కోరా వుండలూ చేసుకుని మింగుతారు. ఎప్పుడూ పూజార్లే తినాలా? లేనివాళ్ళెందుకు తినకూడదు?"

"మున్నూటరవై రోజులూ ఆ గుళ్ళని కనిపెట్టుకు వుండేవాళ్ళు తింటే తప్పేంటి? ఇంతకీ నువ్వెళ్ళి రిక్షా తెస్తావా తేవా?"

కొడుకు నోరు మూసుకుని రిక్షాకోసం వెళ్ళాడు.

భక్తుడు, భార్యతో సహా బయల్దేరి వెళ్ళి మొక్కు తీర్చేశాడు. "నీ దయవల్ల నాకు కలిసి రావాలేగానీ నీ మేలు మర్చిపోను భగవంతుడా! చల్లగా చూడు!" అని ప్రార్థించాడు.

తిరిగి వచ్చిన అరబస్తా కొబ్బరి చిప్పలూ మూటకట్టి మళ్ళీ రిక్షాలో వేయించింది భక్తురాలు. ఎగబడుతోన్న ముష్టివాళ్ళని అదిలిస్తూ రెండు చిప్పలు చితగ్గొట్టి పన్నెంతంత ముక్కలు పంచి పెట్టింది.

ఇంటికి రాగానే తల్లితో కొడుకు "అమ్మా! కొబ్బరి

చిప్పలన్నీ ముక్కలు చేసేసి, అదుగో బడి వొదిలి పెట్టారు. చిన్న పిల్లల్ని తీసుకొస్తాను. ఫలారం పంచి పెడదాం" అంటూ ఉత్సాహం ప్రదర్శించాడు.

"చాల్లే, ఊరుకో. చిప్పలన్నీ ఎండబెట్టి గాను గాడించుదామను కుంటున్నాను. కావాలంటే నువ్వో చిప్ప కొరుక్కుతిను" అంది తల్లి.

"ఛీ! నాకేం వొద్దు" అంటూ బయటికి పోయాడు రామం.

"బాగుంది నాయనా! తండ్రికి కాస్త వివరం తెలిసిందని సంతోషపడతంటే, ఇక నువ్వు తయారౌతు న్నావా నాయనా దూబరా చెయ్యటానికీ?" అని తల్లి సణుక్కుంది.

★ ★ ★

కలిసివచ్చిన మొదటి కంట్రాక్టుతో కుటుంబయ్య మహోత్సాహంతో అదే వ్యాపారంలోకి దిగిపోయాడు.

రోడ్డు పని తీసుకున్నాడు — బాగానే మిగిలింది!

తూముల పని చేయించాడు. ఫర్వా లేదను కున్నాడు.

ధీమాగా తన పేరు మునిసిపాలిటీలో కాంట్రా క్టర్‌గా రిజిష్టర్ చేయించుకున్నాడు.

రెండో, మూడో కాంట్రాక్టుల నాటికే కుటుం బయ్య తను స్వయంగా పని చెయ్యటం మానేసు కున్నాడు. కూలీల్ని కుదుర్చుకోటం, సామాన్లు తెప్పించుకోటం, కూలీలు చురుగ్గా పని చేస్తున్నారో లేదో చూసుకోటం — వాటితోనే సతమతమయ్యాడు. ఎప్పుడన్నా ఖాళీ దొరికినా, కూలీల సరసన పనిలోకి వొంగి రాళ్ళూ రప్పలూ మోస్తే, కూలీలకి తన మీద విలువ వుండదని భయపడేవాడు. క్రమంగా, ఇస్త్రీ బట్టలతో పనికి దూరంగా నిలబడి చూడడం నేర్చు కున్నాడు.

చిన్నా చితకా కంట్రాక్టులన్నీ నొల్లుకోవడం సాగిం చాడు. ఎడతెరిపిలేని పెత్తనం పనులతో వూపిరి పీల్చు కోటానిక్కూడా ఖాళీ లేకుండా వ్యాపారంలో మునిగి పోయాడు. వ్యాపార రహస్యాలన్నీ మరింత ఆకళింపు జేసుకున్నాడు. నూటికి నూటిరవై పాళ్ళు వ్యాపారస్థు డయ్యాడు.

పదేళ్ళు గిర్రున తిరిగాయి.

కుటుంబం— కుటుంబయ్యగారయ్యాడు. డాబా కట్టాడు. కంట్రాక్టర్‌లా గాకుండా యజమానిలాగే కట్టించాడు. పెళ్ళానికి నగలు చేయించాడు. గత మంతా మర్చిపోయి పెళ్ళాం తనని జన్మజన్మలకూ అంటిపెట్టుకుని వుండేలా బంగారంతో మురిపిం చాడు. కొడుక్కి కావలసినంతా ఖర్చుపెడుతూ కాలేజీలో చదివిస్తున్నాడు. టాక్సీ లెక్కడానికి నామోషీ పడి ఒకటో రకం కారుకొన్నాడు.

ఎంత అంతస్తులోనైనా, ఎంత ఐశ్వర్యంలోనైనా, మర్చిపోనిది మాత్రం దేవుడి మొక్కు! ఏటా పెద్ద పెట్టున సత్య నారాయణ వ్రతం చేయిస్తానని మొక్కు కున్నాడు ఎప్పుడో. అన్న మాట తప్పకుండా ప్రతి యేటా వ్రతాలు చేశాడు. వ్రతానికి వారంరోజులు ముందునించే ఏర్పాట్లు ప్రారంభమయ్యేవి. లగ్న నిర్ణయం, శుభ లేఖలు అచ్చొత్తించటం, కావలసిన వాళ్ళందర్నీ పిలవటం — పెళ్ళంత హడావుడి!

ఇక వ్రతం నాటి సంబరం మాట చెప్పనే అక్కర్లేదు. సినిమా పాటలు హోరెత్తించే లౌడ్‌స్పీకర్లూ, సినిమా ట్యూన్లు వాయించే బ్యాండుమేళం, ఖంగు మంటూ ఇల్లు మార్మోగిపోయే పురోహితుల మంత్రాలూ, వచ్చే కార్లూ పోయేకార్లూ, ఇంటిచుట్టూ ఈగల్లా ముసిరే బిచ్చగాళ్ళూ, విస్తళ్ళకోసం ఎగబడే ఊరకుక్కలూ — ఒకటే సందడి! ఏక సందడి ఆ రోజంతా!

రాత్రి చీకటిపడేవరకూ ఇంటికి కొడుకు చేరక పోవటం తప్పితే వ్రతంనాడు మరే లోపమూ జరిగేది కాదు.

"కుటుంబయ్యగారు మహా భక్తుడు!"

"ఈ కలియుగంలో ఇలాంటి పుణ్యాత్ముల్ని ఎక్కడ చూస్తాం?"

"కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం — అనుకునే వాళ్ళకి దైవభక్తేం వుంటుంది?"

"ఆ భగవంతుణ్ణి నమ్మితే వాడెప్పుడూ చల్లగానే చూస్తాడు."

ఆ పొగడ్తలన్నీ వింటూ కుటుంబయ్య ముసి ముసిగా, హుందాగా, నవ్వుకునేవాడు. తను భక్తి పరుడు కాదని యెవరనగలరు? దేవుడు మాత్రం అనగలడా?

ఎక్కడే రాయికనపడ్డా, రప్పకనపడ్డా, కళ్ళు మూసేసి తన దండకం చదువుతూనే వుండేవాడు. "ఏడుకొండలవాడా! వెంకట్రమణా! శ్రీరామచంద్రా! భద్రాద్రివాసా! మీరంతా చల్లగా చూడాలి. మీ మేలు మర్చిపోను."

దేవుళ్ళంతా కుటుంబయ్య గోడు విన్నారో ఏమో, అనుకోకుండా పెద్ద ఛాన్సు ఇచ్చారు.

గవర్నమెంటు పని! నదిమీద రైలు వంతెన కట్టించే పని!

అంత పెద్ద కంట్రాక్టు ఎప్పుడూ దొరక లేదు. ఉరకలు వేస్తోన్న ఉత్సాహంతో ముందడుగు వేశాడు కుటుంబయ్య.

"అంతా గవర్నమెంటోడిది. కొడితే ఇందులోనే కొట్టాలి" అనుకున్నాడు కడుపులో. టెండరు పెట్టాడు.

పోటీకి వచ్చిన కంట్రాక్టర్లిద్దర్ని మోమాట పెట్టి, వాళ్ళ చేతులు తడిచేసి, బతిమాలి బామాలి, వాళ్ళే వెనకడుగులు వేసేలాగ చేసుకున్నాడు. తన డాబా ఇల్లు ప్రభుత్వానికి హామీ చూపించాడు. మొత్తంగా కంట్రాక్టు ఖాయం చేసుకున్నాడు.

ఆ కంట్రాక్టు మీదే కుటుంబయ్య బాగా ఆశలు పెట్టుకున్నాడు. కుటుంబయ్య మీద గవర్నమెంటు సూపర్‌వైజర్లు కూడా బాగానే ఆశలు పెట్టుకున్నారు. ఆశలు తీరేలాగ వాళ్ళ జేబులు బాగానే బరువు చేశాడు కుటుంబయ్య.

పని ప్రారంభించాడు. వర్క్ మెషర్‌మెంటు జరుగుతూనే ఉంది. వర్కు పాసౌతూనే ఉంది. రెండు నెలలకే సగంపైగా పని ముగిసింది. పార్టు బిల్లుకి అప్లయ్ చేశాడు. సకాలంలో అందలేదు డబ్బు.

పలుకుబడి మీద మళ్ళీ వడ్డీలకు అప్పులు తెచ్చాడు. ఆరు నెలల్లో దాదాపు పని పూర్తయిందని పించాడు.

బోసిగా ఉన్న నదిమీద ముచ్చటగా తయారైంది వంతెన. కానీ తన రెండు కళ్ళూ పెట్టి వంతెనకేసి ధైర్యంగా చూడలేక పోయాడు కాంట్రాక్టరు ఎప్పుడూ.

వంతుల ప్రకారం తన వాటా అందుకున్న ఇంజనీరు, కిక్కురుమనకుండా వర్కు పాస్ చేసేస్తాడన్న ధైర్యం మాత్రం ఖచ్చితంగా ఉంది. ఆఖర్న చిల్లర మల్లర పనులు చకచకా చేయించేస్తూ చెక్కురాకకి నేడో రేపోనని ఎదురుచూస్తోన్న సమయంలో పిడుగు లాంటి వార్త విన్నాడు.

డిపార్టుమెంటు ఇంజనీరు బదిలీ అయి పోయాడు! వాళ్ళకీ వాళ్ళకీ ఏవో గొడవ లొచ్చాయి. ఆ ఇంజనీరుక్కూడా సరిగ్గా తెలీకుండా బదిలీ జరిగింది. మరోడు కొత్తగా వచ్చేశాడు. వాడు సాక్షాత్తూ అగ్ని హోత్రుడే!

కుటుంబయ్య, కాళ్ళు విరగదొక్కు కున్నాడు. "ఏం దారి భగవంతుడా!" అని నెత్తి బాదుకున్నాడు. అన్నిటికన్నా ముందు గబగబా పది మొక్కులు మొక్కే శాడు. తెలిసిన వాళ్ళందరి దగ్గిరికి పరుగులెత్తాడు.

"ఎంత అగ్నిహోత్రుడైతే మాత్రం దోసెడు నీళ్ళు చిలకరిస్తే చల్లబడకేం చేస్తాడు లేహోయ్!" అన్నాడు నరసప్ప. మొదట్నుంచీ నరసప్ప మాటమీద చాలా నమ్మకంతో ఉన్న కుటుంబయ్య ధైర్యం కూడగట్టు కున్నాడు. గుండె నిబ్బరం చేసుకున్నాడు — "దేవుడా! నీదే భారం! ఈ గండం గడిపించావో వెయ్యి నూట పదహార్లు నీ దిబ్బెంలో వేస్తాను. తల నీలాలిస్తాను. గౌరీపూజ చేయిస్తాను. నీ గుడి ముందు సంతర్పణ పెట్టిస్తాను. ఏడు కొండలవాడా! వెంకట్రమణా! నీ భక్తుణ్ణి రక్షించు!" అంటూ మొరపెట్టాడు. ముడు పులు కట్టాడు.

గుండె కాస్త కుదుటపడింది.

నాలుగు బుట్టలనిండా పళ్ళూ ఫలారాలూ, నేతి డబ్బా, పంచెల సాపూ — ఏవేవో పట్టించుకుని బయ ల్దేరాడు అగ్ని హోత్రుడి దర్శనానికి!

తీరా అగ్నిహోత్రాన్ని చూస్తే ఉన్న భయం అంతా పోయింది! చిరునవ్వుతో పలకరించాడా ఇంజనీరు!

కుటుంబయ్య ఒంగి ఒంగి దణ్ణాలెట్టాడు. బహుమతులన్నీ ఎదురుగా పెట్టాడు. "తమరు .... రైలు వంతెన తనిఖీ .... నే నేనండీ బాబూ కంట్రాక్టర్ని. పుట్టెడు పిల్లలు కలోణ్ణి" అంటూ నీళ్ళు నమిలాడు.

కాంట్రాక్టర్ వినయమంతా చిరునవ్వుతోనే పరికించాడు అగ్ని హోత్రం. పళ్ళ బుట్టలోంచి రెండు పళ్ళు తీసుకుని మిగతావన్నీ పట్టుకు పొమ్మన్నాడు. "ఇప్పుడు కాదు. ఇవ్వాల్సినప్పుడు ఇద్దువులే అవన్నీ" అన్నాడు.

కుటుంబయ్య సంతోషంతో వెర్రివాడయ్యాడు. "బాబూ! తమరు దయ చూడాలి. మీ మేలు మర్చిపోను జన్మజన్మలకీ" అంటూ వాగుడు పెంచకుండా

జారుకున్నాడు.

అగ్నిహోత్రం ఇంజనీరు వంతెన తనిఖీకి వచ్చాడు.

కుటుంబయ్య చేతులు కట్టుకుని వెనకాల నిలబడ్డాడు.

తనిఖీ ప్రారంభించాడు — ఇంజనీరు.

వంతెన పొడుగునా తిరిగి చూశాడు.

ఏడెనిమిదిచోట్ల సిమెంటు పెచ్చులు ఊడదీయించాడు, టెస్ట్‌కి పంపించాడు.

దిమ్మలు బద్ధలు కొట్టించి, ఇనప కమ్మీలు బైటికి లాగి కొలతలు తీశాడు. వస్తువుల నాణ్యం చూశాడు.

వంతెననిండా ఎక్కడికక్కడ రంధ్రాలు పెట్టాడు.

చిట్టచివరికి బండారం బయట పెట్టాడు. సగానికి సగం మోసం జరిగింది వర్క్‌లో! ఒప్పుకున్న దొకటీ, చేసిందొకటీ! వంతెనకంతా కలిపి గుప్పెడే సిమెంటు! చీపురుపుల్లల్లాంటి కాంక్రీటు! మట్టిలాంటి చౌకబారు సున్నం! ఇనప కమ్మీల మధ్య వుండకూడనంతంత ఖాళీలు! ఉపయోగించినవన్నీ అల్పమైన వస్తువులు! తక్కువ తక్కువ కొలతలు! అంతా చౌక, చౌక! దగా! మోసం!

ఉగ్రుడయ్యాడు అగ్నిహోత్రం!

గజగజలాడాడు కుటుంబయ్య.

"ఏమయ్యా, ఏమిటిది?"

"అయ్‌ఁ............................"

"రైలు వంతెనకట్టావా? బొమ్మరిల్లు కట్టావా?

చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు కుటుంబయ్య. "అయ్‌ఁ ......."

"ఈ వంతెన మీద ఇంకా ఏ బండీ పోలేదు కాబట్టి కనీసం వెయ్యి మందిజనం బతికే వున్నారు. కుటుంబయ్యా! నువ్వెప్పుడూ ఈ వంతెన మీదపోయే రైల్లో ఎక్కకు సుమా! ఏ బస్‌లోనో వెళ్ళు! లేకపోతే వంద మైళ్ళైనా సరే నడిచివెళ్ళిపో! పెళ్ళాం బిడ్డలు కలవాడివి!"

కాంట్రాక్టర్‌కి కళ్ళనీళ్ళే తక్కువ! అంతలోనే చాలా ఆశ్చర్యం! ఈయన ఇలా మారి పోయాడేమిటి? మొన్న నవ్వుతూ మాట్లాడాడే! ఈయన్ని నమ్మి, తను వేరే ప్రయత్నాలన్నీ మానుకుని కూర్చున్నాడు. తీరా ఈయన స్పాట్ మీదకొచ్చి ఇలా గంటాడేంటి? ఇంజనీరు ఇంకా ఇలా అన్నాడు —

"ఈ వంతెన కూలి రైలు బండి నదిలో మునిగితే, ఆ పాపం ఎవరిది? ఎవరిదయ్యా? ఇలా చూడు, నీది! లేకపోతే నాది! తెలిసిందా? ఈ పాపాన్ని పంచుకోడానికి నేను సిద్ధంగా లేను."

కిక్కురు మనకుండా తల దించేసుకుని నించున్నాడు కుటుంబయ్య.

"నిన్నటిదాకా మీ డిపార్టుమెంటు ఇంజ నీరు గారే వర్కుని పాస్‌చేశారు కదా సార్?" అందామా అనుకున్నాడు. నోరు తెరవలేక పోయాడు. లక్షలతో పని! ఆయన కొంచెం శాంతిస్తేనే తను బతికేది. లేకపోతే ఆత్మహత్యే!

"ఈ వంతెన అనుకున్న బరువుకి ఆగదు. ఈ వర్కు పాసవ్వటానికి వీల్లేదు. కూలదోయించి తిరిగి కట్టాల్సిందే. పునాదులతో సహా! అంతవరకూ నీకు పేమెంటు ఉండదు అని తేల్చేశాడు ఇంజనీరు."

కుప్పలా కూలిపోయిన కుటుంబయ్యని ఇంటికి చేర్చారు అప్తులు. తెలివి వచ్చాక లబోలబోమని నెత్తీ నోరూ బాదుకున్నాడు కుటుంబయ్య.

ఇంకేముంది? సర్వనాశనం! సర్వ నాశనం!

చేతిలో వున్న డబ్బేగాక, ఇంకా ఇంకా అప్పులు తెచ్చి వంతెన పూర్తిచేశాడు.

ఇప్పుడు ఇంకా లక్షలు పెట్టి మళ్ళీ కట్టాలా!

నగానట్రా కొంపాగోడూ తెగనమ్మినా వడ్డీలకు చాలదు. అప్పుపుట్టదు. డబ్బు పోయింది! పరపతి పోయింది!

"ఏం దారి? ఏం దారి?" అంటూ ఘొల్లుమన్నాడు.

నిద్రాహారాలు మాని ఆలోచించాడు దారికోసం.

★ ★ ★

ఈ అర్థరాత్రి .... ఈ వానరాత్రి ....

ఈ శివాలయం మండపం మీద ఇప్పటికి ఇలా తేలాడు.

ఇల్లు విడిచింది మొదలూ ఎక్కడికో తెలీకుండా తిరుగుతూనే వున్నాడు. మతి తప్పి సత్రవలవెంట పడ్డాడు.

తిండిలేదు నిద్రలేదు. గుడ్డలు మసి గుడ్డలయ్యాయి. గడ్డం పెరిగింది. ఆఖరికి బికారిలా మిగిలాడు, ఈరోజు!

వర్షం బాగా తగ్గింది.

దూరం నుంచి లైటు తీసుకుని నడిచి వస్తోన్న మనిషి కన్పించాడు. దగ్గరికి వచ్చి మండపం ఎక్కాడు పూజారి.

"ఎవరదీ? అలా పూజ గడపకి అంటుకుంటూ పడుకున్నారేమిటీ? లే, లే, దూరంగా కూర్చో! అయినా అలా ఊళ్ళోకి పోరాదూ? ముష్టి వాళ్ళు దేవుడి గుళ్ళో పడుకోడం ఏమిటి? పాప పుణ్యాలు తెలీకపోతే సరీ" రుసరుసలాడుతూ పెద్ద చప్పుడుతో గర్భగుడి తలుపులు చెరిచాడు.

పూజారి మాటలకు సిగ్గుపడిపోయిన కుటుంబయ్య గడపకు దూరంగా జరిగాడు.

మనసులో బాధ అణుచుకుని గర్భ గుడిలోకి చూస్తూ కూర్చున్నాడు.

అగరు సువాసనలు గాలిలోకి చొచ్చుకు వచ్చాయి. గుడిలో, వెచ్చగా జ్యోతి వెలుగుతోంది. శివపార్వతుల విగ్రహాలకు పట్టువస్త్రాలు కట్టి ఉన్నాయి. గంధం పూతలు పూసి వున్నాయి. బంగారపు ఆభరణాలేవో అలంకరించి ఉన్నాయి. చిత్రమైన సింగారాలతో ఎత్తయిన గద్దెమీద అమర్చి వున్నాయి.

పూజారి గొణుక్కుంటున్నట్టు మంత్రాలు చదవటం ప్రారంభించాడు. విస్తరాకులతో తెచ్చిన ప్రసాదం విగ్రహాల ముందు పెట్టాడు. నైవేద్యం సమర్పించాడు. భళ్ళుమంటూ కొబ్బరికాయలు కొట్టాడు. గణగణా గంట వాయించి హెచ్చరిక చేశాడు. హారతి కర్పూరం వెలిగించి హారతులిచ్చాడు. తతంగం ముగించి గబగబా బయటికి వచ్చాడు. గర్భగుడి తలుపులు మూసి తాళం వేసేశాడు.

చేతిలో కొబ్బరిచిప్ప ద్వారబంధానికేసి కొట్టి పన్నెంతముక్క కుటుంబయ్య మీదికి విసిరాడు — "చాలుగానీ వెళ్ళు వెళ్ళు. అలా వూళ్ళోకి పో!" అని మళ్ళీ కసిరి బరువు బొజ్జతో బురదలో తప తప అడుగులేసుకుంటూ లాంతరు వూగించుకుంటూ బుట్ట పట్టుకుని వెళ్ళిపోయాడు.

గడిచిన నలభై నాలుగేళ్ళ జీవితంలోనూ, ఎన్నడూ ఎరగనంత దుఃఖం వచ్చింది కుటుంబయ్యకి. "భగవంతుడా! నువ్వే దిక్కని నమ్మినందుకు ఇంత చేశావా!" అంటూ బావురుమన్నాడు.

కుటుంబయ్య భగవంతుడిమీద బాగా నమ్మకం పెట్టుకున్నాడు. తన సంతోషం ఎప్పటికప్పుడు భగవంతుడికి పంచి పెట్టాడు. చేసిన పని కలిసి వచ్చినప్పుడల్లా ఆనందంగా మొక్కుబళ్ళు తీర్చాడు. దేవాలయాలన్నీ తిరిగాడు. పెద్ద పెద్ద మొత్తాలు దిబ్బేల్లో వేశాడు. ఏటా తలనీలాలిచ్చాడు. భార్యతో లక్ష్మీ పూజలు చేయించాడు. భక్త బృందాలతో భజనలు చేయించాడు. హరి కథలు చెప్పించాడు.

పెద్ద మొత్తం పెట్టి తన పేర ఒక గుడికూడా కట్టించాడు. ఒకటా రెండా!

కుటుంబయ్యలాంటి భక్తుడు కలి కాలంలో లేడన్న కీర్తితో పరవశించి పోయాడు.

కొడుకు మాత్రం, తల్లిదండ్రుల చేష్టల్ని ఆక్షేపించకుండా వుండలేకపోయే వాడు. "నాన్నా! నీ దానాలూ ధర్మాలూ ఏ దేవుడికీ అందవు. నీలాంటి చాదస్తులు దేవుడి ఖజానాలు పెంచుతోంటే వాటిని కొల్లగొట్టి భద్రపరుచుకునే వాళ్ళు వేరే వున్నారు. వాళ్ళని దేవుడేమీ అడ్డుపెట్టటం లేదు అనేవాడు."

"అదేమిట్రా బాబూ? గుండెలు తీసినట్టు మాట్లాడతావ్! దేవుడి సొత్తు ఎవరు తీస్తే వాళ్ళదే పాపం. అందుకని మనం పూజా పునస్కారాలూ మానేసుకుంటామా? భక్తి శ్రద్ధలతో భగవంతుణ్ణి కొలిస్తే, మన పుణ్యం మనకి ఉంటుంది కదా? భగవంతుడు మెచ్చుతాడు కదా?"

"భగవంతుడు మెచ్చేది నీ మంచి ప్రవర్తన చూసిగానీ, తనకి నువ్వు జరిపించే ఆర్భాటాలు చూసి కాదు నాన్నా! జీవితంలో ఒక్కసారికూడా భగవంతుడి పేరు ఎత్తకపోయినా, నువ్వు నీతి నిజాయితీలతో జీవిస్తే, భగవంతుడు నిన్ను తప్పకుండా మెచ్చుకుంటాడు."

"అయితే ఈ ప్రజలంతా బుర్రలేని వాళ్ళేనంటావా? ఏ గుడికి వెళ్ళి చూస్తావో చూడు. భద్రాచలం .... తిరుపతికొండ .... సింహాచలం .... అన్నవరం .... ఒకటేమిటి? ఎక్కడ చూసినా వేలకొద్దీ భక్తులు కన్పిస్తారు. భగవంతుణ్ణి దర్శించుకోవాలని తహతహలాడుతూంటారు. పూజలు చేస్తారు, వ్రతాలు చేస్తారు, మొక్కులు తీరుస్తారు. వాళ్ళంతా పిచ్చివాళ్ళా?"

"పిచ్చివాళ్ళో వెర్రివాళ్ళో నాకు తెలీదు. కొంచెం బుర్రపెట్టి ఆలోచిస్తే ఎవరికైనా ఇదే తోస్తుందని నేనను

కుంటాను. ఈ దేవాలయాలన్నిటి మీదా లక్షలకొద్దీ రాబడి వస్తోంది, అవునా? అదంతా ఏమౌతోంది? ఎవరు తింటున్నారు? దానితో ఏ సంస్థలు నడుస్తు న్నాయి? ఏ పరిశ్రమలు సాగుతున్నాయి? ఎవరు దీన్ని గురించి పట్టించుకుంటున్నారు?

ఎందుకు నువ్వు వెయ్యి రూపాయలు దిబ్బెంలో వెయ్యాలి? ఎందుకు దేవుడుకి బహుమతులివ్వాలి?

ఒక వంక దేశంలో నిరుద్యోగం, ఆకలి బాధ, అవసరాలూ పెచ్చు పెరుగుతోంటే, మన కర్తవ్యం ఏమిటి? దేవుడి పేరుతో డబ్బుని వృధా చెయ్యటమా? బంగారాలు దేవుడి గుళ్ళల్లో మగ్గబెట్టటమా? దేవుడు ఇదంతా మెచ్చుకుంటాడా? పూజలు చేస్తే పుణ్యం ఇస్తాడా? దేవుడు ఇంత అల్పుడిగా ఆలోచిస్తాడనేది మన ఊహ! మనం అల్పులం కాబట్టి దేవుణ్ణి అలాగే అర్థం చేసుకుంటాం.

పాపం చెయ్యకుండా ఉండాలని ఎందుకు ప్రయత్నించవు నాన్నా? దేవుడికిచ్చే మొక్కులన్నీ పెట్టు బడిగా పెట్టి చిన్న పరిశ్రమ ప్రారంభించు! పది మంది బీద వాళ్ళకి పని కల్పించు! దేశంలో కొంత దారిద్ర్యాన్ని సడలించు. అప్పుడు నీకు కలిగే ఆనందం, సంతృప్తీ, ఏ పూజ ఇస్తుందో, ఏ వ్రతం ఇస్తుందో, ఆలోచించు! ఒకసారి చేసి చూడు!"

అలా నిర్భయంగా మాట్లాడే కొడుకు మాటలు వింటూ కంగారుపడిపోయేవాడు కుటుంబయ్య — "ఒరే! ఒరే! దేవుణ్ణి గురించి అలా మాట్లాట్టానికి నీకు భయం వెయ్యటం లేదూ?" అనేవాడు భయపడుతూ.

"ఎందుకూ? నేనేం చేశాననీ?"

టప్పు టప్పుమని చెంపలు వాయించుకునే వాడు కుటుంబయ్య — "పసి వెధవ! అభమూ శుభమూ తెలియని వాడు. మన్నించు స్వామీ!" అంటూ బితుకూ బితుకూ మంటోన్న గుండెలతో ప్రార్థించే వాడు.

ఈ క్షణం అదంతా ఆలోచిస్తోంటే, కుటుం బయ్యలో అంతకాలమూ మినుకూ మినుకూమంటూ వెలిగే అంతరాత్మ ఒక్కసారి ప్రకాశవంతమైనట్టయింది. తన దైవ భక్తి వ్యర్థమై, తను దోషిగా ఎందుకు నిల బడ్డాడు?

నిజానికి, తను దేవుణ్ణి పవిత్రమైన హృదయంతో, మనస్ఫూర్తిగా ఆరాధించాడా?

దేవుడి మొక్కులు ఎందుకు మొక్కాడు?

దేవుడి ప్రార్థనలు ఎందుకు చేశాడు?

రామానికి అంత ధైర్యం ఎక్కడిది?

"నేనెందుకు భయపడతాను? పాపం చేసేవాళ్ళే భయపడతారు దేవుడికి" అంటాడు, అంత చిన్నవాడు!

నిజమేనా? తను పాపం చేయబట్టే దేవుడికి భయ పడ్డాడా? పాపం చేసినన్నాళ్ళూ భయపడుతూనే వున్నాడా?

నిట్టూర్చాడు కుటుంబయ్య. తన పాపభీతికి దైవభక్తిని అడ్డంగా పెట్టుకున్నాడు. తను అన్యాయంగా గడించిన సొమ్ములో వాటా పెడితే దేవుడు సంతోషిస్తా డనుకున్నాడు. తన పూజలకీ మొక్కులకీ మెచ్చి, దేవుడు తన పాపాల్ని కడిగేస్తాడని నమ్మాడు. తన శీలాన్నీ, ప్రవర్తననీ చూడకుండా దేవుడు కూడా తనతో లాలూచీ ఔతాడనుకున్నాడు. తన పాపాలు గంగా స్నానాల్లో కడిగేసుకోవా లనుకున్నాడు. తన తప్పిదాలు దేవుడి మొక్కులతో వదిలించేసుకోవా లనుకున్నాడు. కానీ తను పాపభీతికి వెరిచి, నీతి నిజాయితీలతో ప్రవర్తించి వుంటే, ఈనాడీ దీనత్వం — భ్రష్టత్వం — సంభవించేవా? — కావు.

కుటుంబయ్య కుమిలి కుమిలి ఏడ్చాడు.

భరించలేని ఆకలితో కడుపు భగభగా మండు తోంది. అలిసిన శరీరం చలితో కుంచించుకు పోతోంది.

కళ్ళ ఎదటి గాఢాంధకారం, మృత్యుభీతి కల్గి స్తోంది. గర్భగుడిలో రాతి విగ్రహాల ముందు ఆకుల నిండా అన్నం వుంది. సజీవమైన మానవ మాత్రుడికి ఆకలి తీర్చగలిగే అన్నం వుంది. జడివానలో.... చలి గాలిలో .... దయనీయమైన దుస్థితిలో తపించే ప్రాణికి సేదదీర్చగలిగే వెచ్చదనం వుంది. అగరు ధూపం ఉంది. జ్యోతి కాంతి ఉంది!

దేవుడికి పంచభక్ష్య పరమాన్నాలతో విందులు చేసిన కుటుంబయ్య — దేవుడికి గుడి కట్టించి ఆశ్రయం ఏర్పరచిన కుటుంబయ్య — దేవుడికి మహోత్సవాలు చేసి మురిసిపోయిన కుటుంబయ్య, ఎందుకంత దీనాతి దీనమైన స్థితిలో వున్నాడు?

"ఎందుకు?" అనుకున్నాడు కుటుంబయ్య కూడా.

దేవుడికి చేసే విందులూ నైవేద్యాలూ వ్యర్థం! దేవుడికి చేసే మహోత్సవాలన్నీ నిష్ప్రయోజనం! దేవుడికి చెల్లించే మొక్కులు స్వార్థపరులకు స్వాహా! ఏదీ దేవుడికి అంటదు. దేనినీ దేవుడు మెచ్చడు.

"మనిషికి ఇచ్చే 'లంచం', దేవుడికి ఇవ్వగలవా నాన్నా?" అన్నాడు రామం చాలా సార్లు.

ప్రతిఫలాపేక్ష లేని హృదయారాధన తప్ప — దేవుడికి ఏం చేసినా, ఏం ఇచ్చినా, లంచమే అవుతుంది.

దేవుడు లంచం తీసుకోడు. అవును. తీసుకోడు.

అపరాధిని శిక్షిస్తాడు. శిక్షించి తీరుతాడు.

"భగవంతుడా! నేను మూర్ఖుడినై నిన్ను స్వార్థ దృష్టితో ప్రార్థించాను. తప్పుడు ఆలోచనలతో నీ పవిత్రతని శంకించాను. నన్ను మన్నించు ప్రభూ! మన్నించు!" — కుటుంబయ్యకు సర్వసంపదలూ పొందినంత ఆనందం కల్గింది.

ఏం చేస్తే దేవుడు సంతోషిస్తాడు?

ఏం చేస్తే దైవారాధన అవుతుంది? కుటుంబయ్యకి తెలిసినట్టయింది.

"ఇంటికి పోతాను. ఉన్నదంతా తెగ నమ్ముతాను. అప్పుడు తీరుస్తాను. నా రెక్కలు నా కున్నాయి. వాటినే నమ్ముకుంటాను. పేదా సాదా బతకడం లేదా?"

గాలికి గంట స్తంభం గంటలు మోగుతూనే వున్నాయి.

[1965 దీపావళి "యువ" మాసపత్రిక నుంచి] ★

## ఈ కథ గురించి:

కుటుంబయ్య కొడుకు, తండ్రితో, దేవుడి మొక్కులకోసం డబ్బు వృథా చెయ్యవద్దని చెపుతూ వుంటాడు. ఒక సందర్భంలో ఇలా అంటాడు. "పాపం చెయ్యకుండా వుండాలని ఎందుకు ప్రయత్నించవు నాన్నా? దేవుడికిచ్చే మొక్కులన్నీ పెట్టుబడిగా పెట్టి, చిన్న పరిశ్రమ ప్రారంభించు! పది మంది బీద వాళ్ళకి పని కల్పించు! దేశంలో కొంత దారిద్ర్యాన్ని సడలించు! అప్పుడు నీకు కలిగే ఆనందం, సంతృప్తీ, ఏ పూజ ఇస్తుందో, ఏ వ్రతం ఇస్తుందో ఆలోచించు!" అంటాడు.

ఈ మాటలు, దేవుడి మొక్కులకోసం డబ్బు వృథా చెయ్యడం నచ్చక చెప్పిన మాటలు. కానీ, ఈ మాటలు చెప్పిన వ్యక్తికి, అతను చెప్పేది ఏమిటో అతనికే తెలీదు.

కుటుంబయ్య అప్పటికే ఒక కాంట్రాక్టరుగా వున్నాడు. బిల్డింగులు కట్టించే పరిశ్రమ నడుపుతూనే వున్నాడు. 'పెట్టుబడి' పెట్టి పరిశ్రమ నడిపితే నలుగురు పేదవాళ్ళకి పని కల్పించవచ్చనీ, దేశంలో దారిద్ర్యం తగ్గుతుందనీ, కొడుకు, తండ్రికి సలహా ఇస్తాడు. అతను అలాగే అనుకుని ఆ మాటలు చెపుతాడు.

ఒక పెట్టుబడిదారుడు, కొంత పెట్టుబడి పెట్టి ఒక పరిశ్రమ నడిపితే, అక్కడ పనిచేసే కార్మికుల శ్రమలోంచి కొంత భాగం ఆ పెట్టుబడిదారుడికి రోజూ పోతూనే వుంటుంది. అది ఆ కార్మికులకు దారిద్ర్యంగానూ, ఆ యజమానికి సిరిసంపదలుగానూ అవుతుంది. దీనివల్ల దేశంలో దారిద్ర్యం తగ్గేదేమీ వుండదు. ఏటా ఎన్ని వేలకోట్ల కొత్త పెట్టుబడులతో కొత్త పరిశ్రమల్ని నడిపినా, కార్మిక ప్రజల్లో దరిద్రంగానీ, నిరుద్యోగంగానీ తగ్గేదేమీ వుండదు.

ఈ అసలు విషయాలు తెలియకుండా మాట్లాడే వాళ్ళందరూ ఇలాంటి తప్పులే మాట్లాడతారు. పరిశ్రమలు నడిపే యజమానులు, ఇతరులకు పనులు కల్పిస్తున్నట్టే పైకి కనపడుతుంది. కానీ అసలు నిజం — ఆ పరిశ్రమలు నడిపే వాళ్ళు, తాము స్వంత శ్రమ చెయ్యకుండా ఇతరుల శ్రమని దోచి దానితో డబ్బు సంపాదించడమే.

కుటుంబయ్య కొడుక్కి ఇవంతా తెలీదు. అందరూ పైకి మాట్లాడేదాన్నే అతనూ మాట్లాడాడు.

పరిశ్రమలు నడపడం అంటే, ఆ నడిపే వాళ్ళు, తమకోసం సిరిసంపదలు సంపాదించడమూ, ఇతరుల్ని దారిద్ర్యంలోకి తొయ్యడమూ — ఇవే జరుగుతాయి.

ఈ విషయాలు నాకు ఆనాడే చక్కగా తెలిసి వుంటే, కథలో ఆ మాటలు అలా వుండేవి కావు.

8-6-2004